ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3 తమిళనాడు TAMILNADU
శనివారం 17 ఆగస్టు 2024



'పొన్నియిన్ సెల్వన్' పోస్టర్

జాతీయ స్థాయిలో
మెరిసిన తమిళ సినిమా

'పొన్నియిన్ సెల్వన్'కు నాలుగు అవార్డులు ● ఉత్తమ నటిగా నిత్యా మేనన్ ● రెహ్మాన్‌కు ఏడోసారి

అడయార్, ఆగస్టు 16: కేంద్రప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో తమిళ సినిమా మెరిసింది. దర్శక దిగ్గజం మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియిన్ సెల్వన్' ఏకంగా నాలుగు అవార్డులను గెలుచుకుంది. ఉత్తమ తమిళ ప్రాంతీయ చిత్రంగా నిలిచింది. ధనుష్ హీరోగా వచ్చిన 'తిరుచిత్రాంబలం' సినిమాలో నటనకుగాను నిత్యా మేనన్‌కు ఉత్తమ నటి అవార్డు వరించింది. అయితే, మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్)తో కలిసి ఈ అవార్డును ఆమె పంచుకోనున్నారు. 2022 డిసెంబరు 31వ తేదీ నాటికి సెన్సార్ అయిన చిత్రాలకు గాను ఈ అవార్డులను జ్యూరీ ప్రకటించింది. ఈ అవార్డుల్లో ప్రముఖ నిర్మాత సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'పొన్నియిన్ సెల్వన్' కు ఉత్తమ ప్రాంతీయ తమిళం చిత్రం అవార్డు, ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడుగా ఏఆర్.రెహ్మాన్, ఉత్తమ సినిమాటోగ్రఫర్‌గా రవివర్మన్, ఉత్తమ సౌండ్ డిజైనర్‌గా అనంద్ కృష్ణమూర్తి 'పొన్నియిన్ సెల్వన్' కోసం ఎంపికయ్యారు. అలాగే ధనుష్ - నిత్యా మీనన్ జంటగా నటించిన 'తిరుచిత్రాంబలం' చిత్రానికి రెండు అవార్డులు వరించాయి. అలాగే, ఉత్తమ నృత్య దర్శకుడుగా జానీ మాస్టర్, సతీష్ కృష్ణన్ గెలుచుకున్నారు.

ఏడోసారి జాతీయ అవార్డు

గత 32 యేళ్ళుగా అగ్రశ్రేణి సంగీత దర్శకుడిగా రాణిస్తున్న ఏఆర్ రెహ్మాన్ ఏడోసారి జాతీయ అవార్డు అందుకోనున్నారు. శుక్రవారం ప్రకటించిన జాతీయ అవార్డుల్లో బెస్ట్ రీరికార్డింగ్ విభాగంలో ఆయనకు ఏడోసారి జాతీయ అవార్డు వరించింది. అంతకుముందు.. ఆయన తొలిసారి 'రోజా' చిత్రానికి గాను ఉత్తమ సంగీత దర్శకుడిగా ఎంపికయ్యారు.

ఆ తర్వాత వరుసగా 'మిన్సార కనవు', 'లగాన్' (హిందీ), 'కన్నత్తిల్ ముత్తమిట్టాల్', 'కాట్రు వెలియిడై' చిత్రాలకు ఆయన ఉత్తమ సంగీత దర్శకుడుగా అవార్డులను అందుకున్నారు. అయితే 2010 నుంచి ఉత్తమ సంగీత దర్శకుడు అవార్డును బెస్ట్ సాంగ్, బెస్ట్ రీరికార్డింగ్ రెండుగా విభజించి ఇస్తున్నారు. ఆ తర్వాత 'మామ్' అనే హిందీ చిత్రానికి ఆయన ఉత్తమ నేపథ్య సంగీత అవార్డు అందుకోగా, ఇపుడు మరోమారు 'పొన్నియిన్ సెల్వన్' కోసం జాతీయ అవార్డు స్వీకరించనున్నారు.

అభినందనలు మణి సర్... : విక్రమ్

'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో ఆదిత్య కరికాలన్ పాత్రలో జీవించిన చియాన్ విక్రమ్.. 'పొన్నియన్ సెల్వన్' చిత్రానికి నాలుగు జాతీయ అవార్డులు రావడంపై స్పందించారు. 'ప్రేక్షకుల ఆదరాభిమానాలు జాతీయ అవార్డుల రూపంలో ఆశీర్వాదంగా లభించాయి. తమిళ చరిత్ర, సాహిత్యం, సంస్కృతి, సినిమా అనేవి ఆ కాలం నుంచి ఇప్పటివరకు ఒకటిగా కలిసి విజయపథంలో పయనిస్తున్నాయి. ధన్యవాదాలు మణి సర్, ఏఆర్ రెహ్మాన్, రవివర్మన్' అంటూ ట్వీట్ చేశారు.



ఏఆర్ రెహ్మాన్



నిత్యా మేనన్

ఢిల్లీ సీఎంకు స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు



అడయార్, ఆగస్టు 16: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయమై ఆయన తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'శుక్రవారం పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని. ఆయన పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, ఎన్ని కష్టాలు ఎదురైనా మనోధైర్యంతో ముందుకు సాగాలని కోరుకుంటూ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు.

శ్రీలంకకు నౌకా రవాణా పునఃప్రారంభం



జెండా ఊపి నౌకను ప్రారంభిస్తున్న పుదుచ్చేరి మంత్రి నమశ్శివాయం, నాగపట్టణం జిల్లా కలెక్టర్ ఆకాష్, ఎంపీ సెల్వరాజ్ తదితరులు

ఐసిఎఫ్, ఆగస్టు 16: నాగపట్టణం నుంచి శ్రీలంకకు నౌక రవాణా సేవలు మళ్లీ ప్రారంభమయ్యాయి. భారత్-శ్రీలంక మధ్య సత్సంబంధాలు ఏర్పరిచేలా 2023 అక్టోబరు 14న సెరియపాణి పేరుతో ప్యాసింజర్ నౌక నడిపారు. ఈశాన్య రుతుపవన వర్షాల కారణంగా అదే నెల 23వ తేది ఈ సేవలు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో, నాగపట్టణం నుంచి శ్రీలంక కాంగేశన్ హార్బర్‌కు మళ్లీ శివగంగై పేరుతో నౌక నడిపేందుకు నిర్ణయించారు. అండమాన్ నుంచి ఈ నౌక నాగపట్టణం హార్బర్‌కు గత వారం చేరుకుంది. ఈ నౌక ట్రయల్ రన్ కొద్దిరోజుల క్రితం జరిగింది. శుక్రవారం ఉదయం రవాణా సేవలను పుదుచ్చేరి మంత్రి నమశ్శివాయం, నాగపట్టణం జిల్లా కలెక్టర్ ఆకాష్, ఎంపీ సెల్వరాజ్ జెండా ఊపి ప్రారంభించారు. 44 మందితో నాగపట్టణం హార్బర్ నుంచి నౌక బయల్దేరిన నౌక మధ్యాహ్నం 2 గంటలకు కాంగేశన్ హార్బర్‌కు చేరుకుంది. మరో మార్గంగా శనివారం ఉదయం 10 గంటలకు కాంగేశన్ హార్బర్ నుంచి బయల్దేరి మధ్యాహ్నం 2 గంటలకు నాగపట్టణం హార్బర్‌కు చేరనుంది. ఆదివారం ఉదయం 8 గంటలకు నాగపట్టణం నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు కాంగేశన్ హార్బర్‌కు చేరుకొని, అక్కడి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి సాయంత్రం 6 గంటలకు నాగపట్టణం హార్బర్‌కు వచ్చి చేరనుంది. ఈ నౌకలో 123 సాధారణ సీట్లు, 27 ప్రీమియం సీట్లు కలిపి మొత్తం 150 సీట్లున్నాయి. ఒకసారి వెళ్లడానికి ప్రీమియం సీట్లకు రూ.7,500, సాధారణ సీట్లకు జీఎస్టీ కలిపి రూ.5,000 నిర్ణయించారు. నౌకలో ఒక వ్యక్తి 25 కిలోల లగేజీ తీసుకెళ్లేందుకు అనుమతిచ్చారు. అంతేకాకుండా నౌకలో సాంబార్ రైస్, పెరుగన్నం, నూడుల్స్ వంటి ఫాస్ట్ ఫుడ్స్ రుసుము చెల్లించి పొందవచ్చు. ప్రయాణికులు ఇబ్బంది లేకుండా ప్రయాణించేలా అన్నిరకాల సౌకర్యాలు ఇందులో ఉన్నాయి.

బీజేపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖుష్బూ?



చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యాచరణ అధ్యక్షురాలిగా ఆ పార్టీ జాతీయ కమిటీ సభ్యురాలు, ప్రముఖ సినీ నటి ఖుష్బూ నియమితులయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే తమపార్టీ అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుందని, త్వరలోనే ప్రకటన వస్తుందని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న అన్నామలై ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ రాజకీయ శాస్త్రాన్ని అభ్యసించేందుకు వచ్చే నెల లండన్ వెళ్తున్నారు. ఆరునెలలపాటు ఆయన లండన్‌లోనే వుంటారు. ఈ విషయమై అన్నామలై మాట్లాడుతూ.. తాను లండన్ వెళ్ళినా రాష్ట్ర అధ్యక్షపదవిలోనే కొనసాగుతానని, తన స్థానంలో కొత్తవారిని పార్టీ అధిష్ఠానం నియమించే ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. అయితే ఆరు నెలలపాటు రాష్ట్రానికి దూరంగా ఉన్నా నాయకులతో తరచూ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ పార్టీ కార్యాకలాపాలను కొనసాగిస్తానని ఆయన ప్రకటించారు. కానీ ఆయన్ని అధ్యక్ష పదవి నుంచి తొలగించాలంటూ పలువురు సీనియర్లు అధిష్ఠానాన్ని ఆశ్రయించారు. ఆ మేరకు తెలంగాణా మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, పార్టీ జాతీయ మహిళా కమిటీ కార్యదర్శి వానతి శ్రీనివాసన్, శాసనసభ్యుడు నయినార్ నాగేంద్రన్‌లో ఎవరో ఒకరిని ఈ పదవి వరించనుందని విస్తృత ప్రచారం జరుగుతోంది. అయితే అలాంటిదేమీ లేదని ఢిల్లీ వర్గాలు స్పష్టతనిచ్చాయి. అన్నామలై గైర్హాజరీలో కార్యకలాపాలు నిరాటంకంగా సాగేందుకు బీజేపీ అధిష్ఠానం ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించింది. అన్ని వర్గాలను కలుపుకుపోయే వ్యక్తిని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించాలని బీజేపీ జాతీయ కమిటీ నిర్ణయించినట్లు తెలిసింది. ఆ మేరకు ఖుష్బూను ఎన్నుకుందని తెలుస్తోంది. రాష్ట్రంలో జరుగనున్న స్థానిక సంస్థల, సహకార సంఘాల ఎన్నికల వ్యూహరచన రూపొందించే బాధ్యతను, సభ్యత్వ ముమ్మర కార్యక్రమాల నిర్వహణ కూడా కార్యాచరణ అధ్యక్షురాలికే అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు సమాచారం.

ర్యాలీకి అనుమతి నిరాకరణ : ఖుష్బూ ఆగ్రహం..

పశ్చిమబెంగాల్‌లోని కొల్‌కతా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలిపై జరిగిన సామూహిక అత్యాచారాన్ని ఖండిస్తూ శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడానికి పోలీసులు అనుమతి నిరాకరించడం పట్ల బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్, నటి ఖుష్బూ ఆగ్రహం వ్యక్తం చేశారు. టి.నగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం కమలాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వైద్యురాలిపై జరిగిన ఈ హత్యాచారాన్ని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, అఖిలేష్ యాదవ్ తదితర ఇండియా కూటమి నేతలెవరూ ఖండించకపోవడం గర్హనీయమని ఆరోపించారు. వైద్యురాలికి నివాళులర్పించేలా బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించేందుకు రాష్ట్ర పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఖుష్బూ అన్నారు.



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

● 2026 ఎన్నికలే టార్గెట్....

ఈసారి 200 సీట్లు లక్ష్యం

అదే మన గమ్యం ● జిల్లా నేతల సభలో స్టాలిన్ శపథం

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో విజయం సాధించిన విధంగానే 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో 200 స్థానాల్లో గెలిచేందుకు పార్టీ శ్రేణులంతా ఇప్పటి నుండే కృషి చేయాలని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. తేనాంపేటలోని అన్నా అరివాలయం కలైంజర్ అరంగంలో డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 39 సీట్లలో గెలిచిన డీఎంకే కూటమి, 2024 ఎన్నికల్లో 40 స్థానాలను కైవశం చేసుకుందని, రాష్ట్రంలో వరుసగా లోక్‌సభ ఎన్నికల్లో రెండు సార్లు ఘనవిజయం సాధించిన పార్టీ ఏదీ లేదన్నారు. ఈ విజయానికి పార్టీ నేతలు, మంత్రులు, జిల్లా కార్యదర్శులు సమష్టి కృషి కారణమని ప్రశంసిస్తూ, పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే 40కి 40 స్థానాలు గెలుచుకుంటామని ప్రకటించామని, ఆ విధంగానే రాబోవు శాసనసభ ఎన్నికల్లో 200 సీట్లు గెలుచుకుంటామని చెప్పారు. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రజానీకం డీఎంకే ప్రభుత్వంపై చూపించే ఆదరాభిమానాలను పరిశీలించిన మీదటే శాసనసభ ఎన్నికల్లో 200 సీట్లు సునాయాసంగా గెలుచుకోవడం ఖాయమన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల నుండి ఇటీవల జరిగిన విక్రవాండి ఉప ఎన్నికల వరకు పార్టీ ప్రజాభిమానాన్ని చూరగొని ఘనవిజయం సాధించగలగటం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సారి కూడా రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వమే మళ్ళీ అధికారంలోకి వస్తుందని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. డీఎంకే ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని, ఏదో ఒక ప్రభుత్వ పథకం వల్ల ప్రతి ఇంటా ఓ వ్యక్తి ఖచ్చితంగా లబ్ధి పొంది ఉంటారని, ఈ విషయాన్ని కార్యకర్తలు, జిల్లా కార్యదర్శులు గుర్తుంచుకుని ప్రచారం చేయాలని కోరారు విదేశీ పెట్టుబడుల కోసం తాను ఈ నెల 27న అమెరికా వెళ్తున్నానని, ఈ సమావేశంలో చేసిన తీర్మానం ప్రకారం డీఎంకే వజ్రోత్సవాల (త్రివిధ ఉత్సవాల) ఏర్పాట్లపై దృష్టిసారించాలని, తాను అమెరికాలో ఉన్నా, పార్టీ అధిష్ఠానవర్గం ద్వారా పనులను పరిశీలిస్తానని చెప్పారు. ఆదివారం జరిగే డీఎంకే మాజీ అధ్యక్షుడు కరుణానిధి వందరూపాయల నాణెం ఆవిష్కరణ సభకు పార్టీ నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డీఎంకే ఆవిర్భవించి 75 యేళ్ల పూర్తయ్యాయని, భారతదేశంలోనే తొట్టతొలిసారిగా ఓ ప్రాంతీయ పార్టీ అధికారాన్ని కైవశం చేసుకున్న రాష్ట్రంగా రాష్ట్రంగా పేరుగడించిందని, 75 యేళ్ల తర్వాత కూడా అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీ కూడా డీఎంకేయేనని స్టాలిన్ సభికుల హర్షధ్వానాల నడుమ తెలిపారు. ప్రస్తుతం ద్రావిడ సిద్ధాంతాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



సమావేశానికి హాజరైన జిల్లా కార్యదర్శులు

సెప్టెంబర్ 17న పార్టీ వజ్రోత్సవాలు...

ఈ సమావేశంలో మూడు తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదించారు. డీఎంకే ఆవిర్భవించి 75 యేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా చెన్నైలో సెప్టెంబర్ 17న పార్టీ వజ్రోత్సవాలను అత్యంత వైభవంగా జరపాలని ఓ తీర్మానాన్ని జిల్లా కార్యదర్శులందరూ ప్రతిపాదించి ఏకగ్రీవంగా ఆమోదించారు. లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి పుదుచ్చేరి సహా 40 స్థానాల్లో గెలిపించినందుకు పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తూ మరొక తీర్మానం చేశారు. డీఎంకే మాజీ అధ్యక్షుడు కరుణానిధి రూపంతో వంద రూపాయాల నాణేన్ని ముద్రించేందుకు ఆమోదించిన కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ మూడో తీర్మానం చేసి ఆమోదించారు. ఆ తీర్మానంలోనే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి పథకాలు ప్రకటించకుండా, నిధులు విడుదల చేయకపోవడాన్ని నిరసన వ్యక్తం చేశారు.. రైల్వే పథకాల్లోనూ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని కూడా ఖండించారు. ఈ సమావేశంలో మంత్రులు దురై మురుగన్, కేఎన్ నెహ్రూ, ఐ.పెరియసామి, పొన్ముడి, ఉదయనిధి స్టాలిన్, గీతా జీవన్, తంగం తెన్నరసు, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, దామో అన్బరసన్, ఏవీ వేలు, అనితా రాధాకృష్ణన్, ముత్తుసామి, ఎంపీలు ఎ. రాజా, అందియూరు సెల్వరాజ్, కనిమొళి, పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, పార్టీ అధికార ప్రతినిధి టీకేఎస్ ఇలంగోవన్, అన్బగలం కళై, ఎస్ ఆస్టిన్, పి. తాయగం కవి పాల్గొన్నారు. ఈ సమావేశానికి 72 మంది జిల్లా శాఖ కార్యదర్శులు హాజరయ్యారు.

కేంద్రం వైఖరిపై అన్నాడీఎంకే ధ్వజం

● కార్యాచరణ సమావేశంలో తీర్మానం

ప్యారీస్, ఆగస్టు 16: రాష్ట్రానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించని కేంద్రప్రభుత్వంపై అన్నాడీఎంకే ధ్వజమెత్తింది. శుక్రవారం జరిగిన కార్యాచరణ సమావేశంలో ఈ మేరకు తీర్మానం ప్రతిపాదించి ఆమోదించింది. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయమైన ఎంజీఆర్ మాలిగైలో పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన కార్యాచరణ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా సీనియర్ నేతలు, జిల్లా కార్యదర్శులు, పార్లమెంటు, అసెంబ్లీ సభ్యులు సుమారు 300 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలపరచడం, జిల్లా కార్యదర్శుల సంఖ్య పెంచడం, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు, అభ్యర్థుల ఎంపిక అధికారాలు పళనిస్వామికి అప్పగించడం తదితర 11 తీర్మానాలను ఈ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. 18వ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలపై నియోజకవర్గాల వారీగా ఎడప్పాడి ఇటీవల సమావేశమైన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు త్వరలో జరుగనున్న ఎన్నికల్లో, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే అత్యధిక స్థానాల్లో గెలిపించాలని, పార్టీ శ్రేణులంతా ఎడప్పాడికి బలంగా ఉండాలని, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విడియల్ డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దింపాలి తదితర తీర్మానాలను కార్యాచరణ సమావేశం ఆమోదించింది. ముఖ్యంగా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తమిళనాడుకు నిధులివ్వకపోగా, ఒక్క కొత్త పథకాన్ని కూడా ప్రకటించకపోవడంపై ఈ సమావేశం ఖండించింది. ఈ సమావేశం అనంతరం ఎడప్పాడి మీడియాతో మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలన, రాష్ట్రంలో డీఎంకే పాలనలో నిత్యావసర సరుకుల ధరలు, ఇంధన ధరలు పెరిగినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇటీవల పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ మీటరు రీడింగ్ ప్రతినెలా చేపట్టాలని, కావేరి జలాలు, మెకెదాటు డ్యాం, కచ్చా దీవి, ముల్లైపెరియార్ డ్యాం సమస్యలను పరిష్కరింపజేసేందుకు డీఎంకే పాలకులు ఎలాంటి ప్రయత్నాలు చేపట్టలేదన్నారు.



దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

సంతాపం...

ఈ కార్యాచరణ సమావేశంలో అన్నాడీఎంకే నిర్వాహకులు, ప్రముఖులు సహా 312 మంది మృతికి సంతాపం తెలియజేసింది. కేరళ రాష్ట్రం వయనాడు దుర్ఘటనలో చిక్కుకుని మరణించిన వారికి, కళ్లకుర్చి కల్తీ సారా తాగి మరణించిన వారికి, ఉత్తరాఖండ్‌లో కొండ ఎక్కే ప్రయత్నంలో మరణించిన వారికి సంతాపం తెలుపుతూ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నేతలు కేపీ మునుస్వామి, దిండుగల్ శ్రీనివాసన్, డి.జయకుమార్, సెల్లూరు రాజు, సెంగోట్టయన్, వలర్మతి, గోకుల ఇందిర, పి.బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

24వేల ఎకరాలకు సాగునీరందించే అత్తికడవు - అవినాశి పథకానికి
నేడు స్టాలిన్ శ్రీకారం



చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు, ఈరోడ్, తిరుప్పూరు జిల్లాల్లో 24,468 వేల ఎకరాలకు సాగునీరందించే అత్తికడవు - అవినాశి పథకాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ప్రారంభించనున్నారు. ఈరోడ్ జిల్లా భవానీ కాళింగరాయన్ ఆనకట్టు సమీపంలో మొదటి పంపింగ్ స్టేషన్ వద్ద ప్రారంభోత్సవ కార్యక్రమానికి చెన్నై సచివాలయం నుండి ఆయన శ్రీకారం చుట్టనున్నారు. అత్తికడవు - అవినాశి పథకం అమలు చేయాలని కోయంబత్తూరు, ఈరోడ్, తిరుప్పూరు జిల్లా ప్రజలు, రైతులు ఐదు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. ఈ మూడు జిల్లాల ప్రజల చిరకాల కోరిక నెరవేర్చే ఈ పథకాన్ని స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా కోయంబత్తూరు సహా మూడు జిల్లాల్లో జలమనరుల శాఖకు చెందిన 32 చెరువులు, పంచాయతీ యూనియన్లకు చెందిన 32 చెరువులు, 971 వాగులకు నీరందేలా 958 కి.మీ.ల మేర పైప్‌లైన్లు వేశారు. ఈ పథకం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. అంతేకాకుండా ఈ పథకం ద్వారా పెరుందురై, చెన్నిమలై, నంబియూరు, గోపిశెట్టిపాళయం, ఊత్తుకుళి, అవినాశి, తిరుప్పూరు, అన్నూరు, సూలూరు, పెరియనాయకన్ పాళయం, కారమడై తదితర ప్రాంతాలకు చెందిన 24వేల 468 ఎకరాలకు సాగునీరు అందుతుందని నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్ తెలిపారు. రాష్ట్రంలో భూగర్భ జలాల పెంపు కోసం చేపట్టిన తొట్టతొలి సాగుజలాల పథకం ఇదేనని ఆయన వివరించారు.

సమాచార ధ్వని

25న తెలుగు భాషాదినోత్సవం

● విద్యార్థులకు పురస్కారాలు

అడయార్, ఆగస్టు 16: స్థానిక మైలాపూర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి (రిజిస్టర్డ్) ఆధ్వర్యంలోని సంగీత, సాహిత్య, సాంస్కృతి, సాంఘిక కార్యక్రమం 'నెల నెలా వెన్నెల' కార్యక్రమంలో భాగంగా, ఈ నెల 25న "తెలుగు భాషాదినోత్సవం - విద్యార్థులకు పురస్కారాలు" పంపిణీ జరుగనుంది. అంతర్ పాఠశాలల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారు. మైలాపూర్, లజ్ చర్చి రోడ్‌లో ఉన్న ఆంధ్ర మహిళా సభలో ఈ నెల 25వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షుడు డాక్టర్ అజంతా కె.శంకర రావు సభాధ్యక్షులుగాను, ప్రముఖ సినీ నేపథ్య గాయని గోపికా పూర్ణిమ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. డీఆర్ బీసీసీసీ హిందూ కాలేజీ తెలుగు సహాయాచార్యులు డాక్టర్ తుమ్మపూడి కవిత సభ నిర్వహణ చేస్తారని సమితి నిర్వాహకులు విడుల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఒలింపిక్ విజేతల పోస్టల్ కవరు విడుదల

ఐసిఎఫ్, ఆగస్టు 16: ఒలింపిక్ విజేతల రికార్డుల స్మారకార్థం ప్రత్యేక పోస్టల్ కవరును ప్రధాన పోస్ట్ మాస్టర్ జనరల్ మరియమ్మదాస్ విడుదల చేశారు. ఒలింపిక్స్‌లో దేశానికి ఘనత తెచ్చిన క్రీడాకారుల ప్రతిభను ప్రశంసిస్తూ ప్రత్యేక పోస్టల్ కవరును తపాలా శాఖ రూపొందించింది. ఈ కవరును అన్నాసాలైలో ఉన్న ప్రధాన కార్యాలయంలో మరియమ్మదాస్ విడుదల చేశారు.

22 నుంచి టేబుల్ టెన్నిస్ పోటీలు

ఐసిఎఫ్, ఆగస్టు 16: ఇండియన్ ఆయిల్ అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ 2024 పోటీలు పెరియమేడులోని నెహ్రూ స్టేడియంలో ఈ నెల 22 నుంచి సెప్టెంబరు 7వ తేది వరకు జరుగనున్నాయి. ఈ పోటీల్లో స్టార్ క్రీడాకారులైన శరత్ కమల్, మనిక భత్ర, ఫెర్నాండెడ్ సాక్స్, జ్ఞానశేఖర్ తదితరులు పాల్గొంటున్నారు. ఈ పోటీలు వీక్షించేందుకు టిక్కెట్ల విక్రయాలు 'బుక్ మై షో' యాప్‌లో ప్రారంభమయ్యాయి. సాధారణ టిక్కెట్లు రూ.49 నుంచి రూ.99, వీఐపీ స్టాండ్ రూ.999 నుంచి రూ.1,499, కోర్టు సైడ్ స్టాండ్ రూ.1,499 నుంచి రూ.1,999 వరకు నిర్ణయించారు. పోటీలు జరిగే రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నెహ్రూ స్టేడియం మొదటి ఎంట్రన్స్ గేట్‌లో ఉన్న బాక్సాఫీసులోనూ టిక్కెట్లు పొందవచ్చు.

13 మెట్రో రైల్వేస్టేషన్లలో ట్రావెల్ కార్డ్ మెషీన్లు

ఐసిఎఫ్, ఆగస్టు 16: స్థానిక సెంట్రల్, ఎగ్మూర్ సహా 13 మెట్రో రైల్వేస్టేషన్‌లలో ట్రావెల్ కార్డుల యంత్రాలు పరిచయం చేశారు. ప్రయాణికులు క్యూలో నిల్చోకుండా టిక్కెట్లు పొందే సదుపాయాలను వివిధ రూపాల్లో కల్పిస్తున్నారు. ఈ క్రమంలో, సీఎంఆర్ఎల్ కోయంబేడు, గిండి, థౌజండ్ లైట్స్, గవర్నమెంట్ ఎస్టేట్, ఎగ్మూర్, సెంట్రల్ సహా 13 రైల్వేస్టేషన్లలో రవాణా కార్డులు అందజేసే యంత్రాలను ఏర్పాటుచేసింది. స్థానిక నందనం మెట్రో రైల్వేస్టేషన్‌లో సీఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సిద్ధిక్ ట్రావెల్ కార్డు విక్రయించే యంత్రాలను గురువారం ప్రారంభించారు.

రైలు సేవల్లో మార్పులు

● రెండు హెల్ప్‌లైన్ నెంబర్లు

ఐసిఎఫ్, ఆగస్టు 16: తాంబరం రైల్వే యార్డులో అభివృద్ధి పనులు జరుగుతుండడంతో ఎగ్మూర్ నుంచి దక్షిణ జిల్లాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు, చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు మార్గంలో సబర్బన్ రైళ్ల సేవల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ, ఈ మార్గంలో కొన్ని సబర్బన్ రైళ్లు మాత్రం నడుపుతున్నారు. ఈ రైళ్ల సేవల మార్పుల వివరాల గురించి ప్రయాణికులు తెలుసుకొనేలా 044-25354995, 25354151 అనే హెల్ప్ లైన్ నెంబర్లు పరిచయం చేశారు. ఈ నెంబర్లు ఆదివారం అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉంటాయని చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు.

75 ప్రాంతాల్లో బ్యాటరీ స్వైపింగ్ మెషీన్లు

పెరంబూర్, ఆగస్టు16:రాజధాని నగరం చెన్నైలోని 75ప్రాంతాల్లో మోటారు వాహనాల బ్యాటరీ స్వైపింగ్ మెషీన్లు ఏర్పాటుచేయనున్నట్లు సన్ మొబిలిటీ సంస్థ ప్రకటించింది. స్వైపింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో సన్ మొబిలిటీ, రాష్ట్రప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం జరిగింది.

29 నుంచి మీనాక్షి అమ్మవారి ఆవణి ఉత్సవాలు

పెరంబూర్, ఆగస్టు 16: మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో ఆవణి మూల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 18వ తేది వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయి.

రేపటి నుంచి తిరుమూర్తి డ్యాం నీరు విడుదల

పెరంబూర్, ఆగస్టు16:ఈనెల 18నుంచి తిరుమూర్తి డ్యాం ద్వారా సాగునీరు విడుదల చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. తిరుప్పూర్ జిల్లా పరంబికుళం ఆలియారు పథకంలో తిరుమూర్తి డ్యాం ద్వారా పాలారు బేసిన్ 2 జోన్ ఇరిగేషన్ పరిధిలోని భూములకు సాగునీటిని విడుదల చేయనున్నట్లు రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 18నుంచి డిసెంబరు 16వ తేదీవరకు 120రోజుల పాటు నీరువిడుదల చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

వాతావరణం అధ్యయనానికి రెండు రాడార్లు

పెరంబూర్, ఆగస్టు 16: వాతావరణంలో మార్పులను అధ్యయనం చేసేందుకు రెండు ప్రాంతాల్లో రాడార్లు ఏర్పాటుచేయనున్నారు. రామనాథపురం, ఏర్కాడు ప్రాంతాల్లో సి-బాండ్ డోప్లర్ రాడార్ల కొనుగోలుకు రూ.50 కోట్ల మేర టెండర్లు విడుదలయ్యాయి. ఈ రాడార్ల ఏర్పాటుతో వాతావరణ మార్పుల వివరాలు తెలుస్తాయని, దానికి అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టేందుకు అవకాశముంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రకటన విడుదల చేసింది.

చదురగిరికి భక్తులకు అనుమతి

ఐసిఎఫ్, ఆగస్టు 16: చదురగిరికి వెళ్లేందుకు భక్తులకు నాలుగు రోజుల పాటు అనుమతిచ్చారు. పశ్చిమ కనుమల్లో ఉన్న చదురగిరి సుందర మహాలింగం ఆలయంలో ఈ నెల ప్రదోషం, పౌర్ణమి ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. వీటిలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకొనేందుకు శనివారం నుంచి 20వ తేది వరకు భక్తులకు అటవీ శాఖ అనుమతించింది. ఈ నేపథ్యంలో, ప్రదోషం, పౌర్ణమి పూజలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అయితే, భక్తులు రాత్రి వేళ ఆలయంలో బసచేసేందుకు అనుమతి లేదని, నిషేధిత వస్తువులు తీసుకురాకూడదని అటవీ శాఖ అధికారులు ఆంక్షలు విధించారు.

లోక్‌సభ ఎన్నికల్లో విజయం

● కరుప్పనస్వామికి మొక్కు చెల్లించిన ఎంపీ

పెరంబూర్, ఆగస్టు 16: పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించిన చిదంబరం కాంగ్రెస్ ఎంపీ కార్తీ మారనాడు కరుప్పనస్వామికి 20 అడుగుల పొడవున్న కొడవలి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శివగంగ జిల్లా తిరుపాచేత్తి సమీపం మారనాడులో ప్రసిద్ధిచెందిన కరుప్పన్ స్వామి ఆలయం ఉంది. పార్లమెంటు ఎన్నికల సమయంలో, ఎన్నికల్లో గెలిస్తే మారనాడు కరుప్పనస్వామికి కొడవలి సమర్పిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి కార్తీ చిదంబరం మొక్కుకున్నారు. ఆ ఎన్నికల్లో ఆయన 2 లక్షల మెజార్టీతో విజయం సాధించారు. దీంతో, ఎంపీ కార్తీ శుక్రవారం కరుప్పనస్వామి ఆలయానికి 20 అడుగుల పొడవైన కొడవలి కానుకగా సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.



స్వామివారికి కొడవలి సమర్పిస్తున్న ఎంపీ కార్తీ చిదంబరం

ఉత్తర చెన్నైలో 150 రోడ్‌సైడ్ దుకాణాలు



ఎంకేబీ నగర్‌లో ఏర్పాటుకానున్న ఆహార విక్రయ మండలం

ఐసిఎఫ్, ఆగస్టు 16: ఉత్తర చెన్నైలో ఒకేచోట 150 రోడ్‌సైడ్ దుకాణాలను ఏర్పాటుచేసేందుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. నగరంలో పలు రోడ్‌సైడ్ దుకాణాలున్నాయి. ఆక్రమణ దుకాణాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో, ఈ దుకాణాలు క్రమబద్ధీకరించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆహార విక్రయ మండలాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసి అందులో రోడ్ సైడ్ దుకాణాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఉత్తర చెన్నైలో తొలిసారిగా ఎంకేబీ నగర్ నార్త్ అవెన్యూ రోడ్డులో కెప్టెన్ కాటన్ కాలువ సమీపంలో ఉన్న స్థలాన్ని ఎంపిక చేసి 150 దుకాణాలు ఏర్పాటుచేయనున్నారు. ఈ స్థలాన్ని శుక్రవారం పరిశీలించిన అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుతం ఇక్కడ బస్సులు, లారీలు పార్క్ చేస్తున్నారని, అన్ని ఆక్రమణలు తొలగించి ఆహార విక్రయ మండలం కోసం ఈ రోడ్డు వినియోగించనున్నామని తెలిపారు. 96 మంది వ్యాపారులు ఇక్కడకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

పరందూరు ఎయిర్‌పోర్ట్‌ను వ్యతిరేకిస్తూ గ్రామసభలో తీర్మానం



గ్రామసభలో పరందూరు పరిసర గ్రామాల ప్రజలు

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరు సమీపం పరందూరు వద్ద నిర్మించనున్న గ్రీన్ ఎయిర్‌పోర్ట్‌ను వ్యతిరేకిస్తూ గురువారం ఉదయం స్వాతంత్ర్య దినం సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో తీర్మానం చేశారు. పరందూరులో విమానాశ్రయం ఏర్పాటు చేయకూడదంటూ పరందూరు, ఏకనాపురం తదితర 14 గ్రామాలకు చెందిన ప్రజలు 750 రోజులకు పైగా వివిధ రకాల ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్ నిర్మించేందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు ప్రారంభించాయి. వచ్చే యేడాది ప్రాజెక్టు పనుల టెండర్లు జారీ చేయనున్నట్లు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో ఆరుసార్లు గ్రామ సభలు నిర్వహించి ఏకనాపురం, పరందూరు తదితర గ్రామాలకు చెందిన ప్రజలు తీర్మానాలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఎనిమిదోసారి గ్రామసభ జరిపి పరందూరు విమానాశ్రయానికి వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశారు.

రాష్ట్రంలో మంకీ పాక్స్ ప్రభావం లేదు

● వైద్య ఆరోగ్య శాఖ వెల్లడి

అడయార్, ఆగస్టు 16: ఆఫ్రికా దేశాలతో పాటు పాకిస్థాన్‌లో వ్యాపిస్తున్న మంకీ పాక్స్ ప్రభావం రాష్ట్రంలో లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం మంకీ పాక్స్ వైరస్ విస్తారంగా వ్యాపిస్తుంది. తాజాగా స్వీడెన్ దేశంలో ఈ వైరస్ కేసు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ ప్రపంచ దేశాలకు ఓ హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందిస్తూ, ఈ మంకీ పాక్స్ వైరస్ ప్రభావం రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా, అన్ని జిల్లాల యంత్రాంగాలను అప్రమత్తం చేసామని, విమానాశ్రయ అధికారులను కూడా అలెర్ట్ చేసామని పేర్కొన్నారు. ఇదే విషయంపై వైద్య శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కాంగో, సెంట్రల్ ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను ఎయిర్‌పోర్టుల్లో స్క్రీనింగ్ చేయాలని కోరారు. మంకీ పాక్స్ వైరస్ లక్షణాలు కనిపించిన ప్రయాణికుల విషయంలో ఆరోగ్య శాఖ మార్గదర్శకాలను పాటించాలన్నారు. స్కిన్ అలెర్జీ, రెండు నుంచి నాలుగు వారాల పాటు జ్వరం, తల, కండలు, శరీరం నొప్పులుండటం ఈ వైరస్ లక్షణాలుగా భావించాలన్నారు. ఈ వైరస్ కేవలం మనుషుల నుంచి మాత్రమే కాకుండా జంతువుల నుంచి కూడా వ్యాపిస్తుందన్నారు. వైరస్ సోకివున్నట్టు భావించిన వ్యక్తులను తక్షణం చికిత్స కోసం పంపించాలన్నారు. వైరస్ సోకిన వ్యక్తులో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకోరాదని వైద్య ఆరోగ్య శాఖ సూచన చేసింది.

టీఎన్‌పీఎస్సీ ఫలితాల విడుదల

పెరంబూర్, ఆగస్టు 16: ఇంటిగ్రేటెడ్ ఇంజనీర్ ఖాళీల భర్తీకి జనవరి 6,7 తేదీల్లో రాతపరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా ఫలితాలు శుక్రవారం టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదలయ్యాయి. 358 పోస్టుల కోసం 644 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని టీఎన్‌పీఎస్సీ పరీక్ష నియంత్రణ అధికారి ఎ.జాన్ లూయిస్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు ఓరల్ హెల్త్ స్క్రీనింగ్



ఓరల్ హెల్త్ స్క్రీనింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

అడయార్, ఆగస్టు 16: నగరంలోని ప్రముఖ ఆస్పత్రుల్లో ఒకటైన సవీత దంత వైద్య కళాశాల, ఎంకే మోహన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓరల్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపును గురువారం నగరంలో నిర్వహించారు. 12 మున్సిపల్ స్కూల్స్‌కు చెందిన దాదాపు 3500 మంది విద్యార్థులు ఈ క్యాంపులో పాల్గొన్నారు. షెనాయ్ నగర్‌లోని తిరువిక స్కూల్‌లో నిర్వహించిన ఈ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపును గ్రేటర్ చెన్నై డిప్యూటీ పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఇందులో నోటి సంరక్షణ తదితర అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. పలువురు వైద్యులు విద్యార్థులకు ఓరల్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, నోటి సంరక్షణపై సూచనలు చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా 33 మంది డీఎస్పీలు బదిలీ

అడయార్, ఆగస్టు 16: రాష్ట్ర వ్యాప్తంగా 33 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ శంకర్ జీవాల్ ఆదేశాలు జారీ చేశారు. ఇదే విషయంపై డీజీపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ బదిలీల్లో భాగంగా, ధర్మపురి జిల్లా పాలకోడు డీఎస్పీ సింధును తిరువళ్ళూరు జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ వింగ్ డీఎస్పీగా నియమించారు. కోయంబత్తూరు జిల్లా సివిల్ సప్లై విభాగం డీఎస్పీగా ఉన్న జనని ప్రియను వీఆర్‌కు పంపించారు. తిరుచ్చి జిల్లా మణప్పారై డీఎస్పీ మారిముత్తును కోయంబత్తూరు జిల్లా సివిల్ సప్లై సీబీడీ డీఎస్పీగా నియమించారు తంజావూరు జిల్లా వల్లం డీఎస్పీ నిత్యను తంజావూరు సివిల్ సప్లై సీబీడీ విభాగం డీఎస్పీగా నియమించారు. ఇప్పటివరకు వీఆర్‌లో ఉన్న సురేష్ కుమార్‌ను నామక్కల్ జిల్లా క్రైమ్ బ్రాంచ్ డీఎస్పీగా నియమించారు. ఇదే విధంగా పలు జిల్లాల్లో పలు విభాగాల్లో పనిచేస్తూ వచ్చిన డీఎస్పీలను వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేశారు.

పూందమల్లి యార్డ్‌లో త్వరలో మెట్రో ట్రయల్ రన్



పూందమల్లిలో ఏర్పాటవుతున్న మెట్రోరైళ్ల యార్డ్

ఐసిఎఫ్, ఆగస్టు 16: స్థానిక పూందమల్లి యార్డ్‌లో మెట్రోరైలు ట్రయల్ రన్ సెప్టెంబరులో నిర్వహించనున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. నగరంలో రెండో విడత మెట్రోరైలు పథకం 116.1 కి.మీ మేర మూడు మార్గాల్లో ఏర్పాటవుతోంది. పూందమల్లి-లైట్ హౌస్ వరకు 26 కి.మీ మెట్రోరైలు మార్గం పనులు జరుగుతున్నాయి. పూందమల్లి బైపాస్ నుంచి కోడంబాక్కం పవర్ హౌస్ వరకు ఫ్లై ఓవర్ మీదుగా, కోడంబాక్కం నుంచి లైట్ హౌస్ వరకు సొరంగమార్గంలో కలిపి మొత్తం 28 స్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. పూందమల్లి-లైట్ హౌస్ మధ్య రైలుపట్టాలు ఏర్పాటు పనులు పూర్తికావచ్చాయి. అలాగే, రూ.187 కోట్లతో మూడేళ్ల క్రితం ప్రారంభమైన పూందమల్లి యార్డు పనులు కూడా చివరిదశకు చేరుకున్నాయి. దీంతో, ఈ యార్డులో సెప్టెంబరులో మెట్రోరైలు ట్రయల్ రన్ చేపట్టనున్నామని అధికారులు తెలిపారు.

వరదల్లో చిక్కుకున్న 9 మంది క్షేమం



వరదలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న దృశ్యం

పెరంబూర్, ఆగస్టు 16: తేని జిల్లా పెరియకుళం సమీపం కుంభకరై జలపాతం సమీపంలో వరదల్లో చిక్కుకున్న వారిని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. కీలవడకరై పంచాయతి పెరుమాళ్ పుదూర్‌కు చెందిన ఐదుగురు చిన్నారులు, నలుగురు మహిళల మొత్తం 9 మంది కుంభకరై జలపాతం వద్దకు గురువారం స్నానాలకు వెళ్లారు. ఆ సమయంలో ఊహించని విధంగా వరద ప్రవాహం రావడంతో వారు సమీపంలోని ఎత్తైన రాళ్ల ప్రాంతానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పెరియకుళం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని రాళ్లలపై ఉన్న వారిని సురక్షితంగా రక్షించారు. అలాగే, వారికి ఏవైనా గాయాలున్నాయా అని 108 సిబ్బంది ద్వారా పరీక్షలు నిర్వహించిన అనంతరం వారిని ఇళ్లకు పంపినట్లు అధికారులు తెలిపారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా... నగరంలో నల్లబ్యాడ్జీలతో ప్రభుత్వ వైద్యుల ధర్నా



ఎగ్మూరు ప్రభుత్వ మెటర్నటీ ఆస్పత్రి వద్ద ధర్నా జరుపుతున్న ప్రభుత్వ మహిళా వైద్యులు

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ నగరంలోని ప్రభుత్వ వైద్యులు శుక్రవారం ఉదయం నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళా వైద్యులకు పటిష్టమైన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నగరంలోని రాజీవ్‌గాంధీ స్మారక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, స్టాన్లీ వైద్యకళాశాల ఆసుపత్రి, ఓమందూరార్ ప్రభుత్వ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి, గిండీలోని ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, ఎగ్మూరు ప్రసూతి ఆస్పత్రి వద్ద వైద్యులు శుక్రవారం ఉదయం నల్లబ్యాడ్జీలు ధరించి, చేత ప్లకార్డులుతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కొల్‌కత్తా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన సంఘటన రాష్ట్రంలో జరుగకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, మహిళా డాక్టర్లకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

'వయనాడ్' కోసం వీఎంఆర్ఎఫ్ విరాళం



చెక్కును అందజేస్తున్న డాక్టర్ సుధీర్

అడయార్, ఆగస్టు 16: వయనాడ్ కోసం వినాయక మిషన్ రిసెర్చ్ ఫౌండేషన్ రూ.30లక్షల విరాళం ప్రకటించింది. ప్రకృతి ప్రకోపానికి బలై సర్వం కోల్పోయిన కేరళలోని వయనాడ్‌లో సహాయక చర్యల కోసం కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి వీఎంఆర్ఎఫ్ ఈ విరాళాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో (సేలం జిల్లా)ప్రముఖ డీమ్డ్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిన (వీఎంఆర్ఎఫ్ తరఫున వైస్ చాన్సలర్ డాక్టర్ సుధీర్ రూ.30 లక్షల చెక్కును కోళికోడ్ నగర మేయర్ డాక్టర్ బీనా ఫిలిప్‌కు అందజేసినట్టు వీఎంఆర్ఎఫ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

31లోపు రేషన్ సరుకుల పంపిణీ

● మంత్రి చక్రపాణి

ప్యారీస్, ఆగస్టు 16: ఈ నెల 31వ తేదిలోపు 2.24 కోట్ల కుటుంబాలకు రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి చక్రపాణి తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... చౌక దుకాణాల్లో వినియోగదారులకు సక్రమంగా సరుకులు అందడం లేదని, పండుగ సమయంలో ఉచిత ధోవతి, చీరలు పంపిణీ చేయడం లేదని ప్రతిపక్షాలు ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల కారణంగా రాష్ట్రంలో కొన్ని నెలలుగా చౌక దుకాణాల్లో రేషన్ సరుకుల పంపిణీలో జాప్యం జరిగింది వాస్తవమేనని, అయితే ఇప్పుడు ఆ పరిస్థితి చక్కబడిందని, ఈ నెలాఖరుకు రేషన్ కార్డులన్నింటికీ సరుకులు అందేలా ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 16: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

వలసరవాక్కం: విరుగంబాక్కం ఆళ్వార్ తిరునగర్, వలసరవాక్కం

కీల్పాక్కం: కేజీ రోడ్డు, త్యాగప్ప వీధి, ఈఎస్ఐ మండపం రోడ్డు, అప్పావు అవెన్యూ, స్వామిదాసపురం, ఆస్ప్రిన్ గార్డన్, శివశంకరన్ వీధి, హాలీస్ వీధి, వల్లియమ్మాళ్ వీధి, ఆలయ వీధి, బ్యాంక్ వీధి, ఉమయాళ రోడ్డు, న్యూ ఆవడి రోడ్డు, రాణి అన్నానగర్, కామరాజ్ నగర్, డా.అంబేడ్కర్ నగర్, అళగప్ప నగర్, లక్ష్మీ వీధి, ధర్మరాజ ఆలయ వీధి, పూందమల్లి హైరోడ్డు, మేనోడ వీధి, పండారం వీధి, ఏకే స్వామి 1 నుంచి 9 వీధులు, వత్తవాడై వీధి, సుబ్బరాయన్ మెయిన్ రోడ్డు 1 నుంచి 5 వీధులు, చిన్నబాబు వీధి, ప్రిన్స్ మానర్, ప్రిన్స్ టవర్, పాట్టై వీధి, సిటీ సెంటర్, టీహెచ్ రోడ్డు ఏరియా, మేడవాక్కం ట్యాంక్ రోడ్డు, మేడవాక్కం 1,2 వీధులు, సెక్రటేరియట్ కాలనీ 1,2,7,8 వీధులు, ఏకే స్వామి వీధి, దివాన్ బహదూర్ షణ్ముగం వీధి, సెమ్మన్‌పేట, అంతోనియార్ 1వ వీధి, కుముదం ప్రింటర్స్, టైలర్స్ రోడ్డు, టవర్ బ్లాక్ క్వార్టర్స్, అప్పా గార్డన్ వీధి, లండన్ రోడ్డు, బెరాక రోడ్డు, వరదమ్మాళ్ గార్డన్ 1 నుంచి 3,7,8 వీధులు, టీవీహెచ్ లుంబిని క్వార్టర్స్, లేడీస్ అండ్ జెంట్స్ హాస్టల్, తంబుస్వామి రోడ్డు, రంగనాథన్ అవెన్యూ, సిల్వాన్ లాడ్జి కాలనీ 1 నుంచి 4 వీధులు, వాసుదేవన్ వీధి, వాటాస్ రోడ్డు, బెయింట్స్ స్కూల్, మాణికేసరి వీధి, సీఎంఆర్ఎల్, పారస్ రెసిడెన్సీ, ముత్యాలచెట్టి వీధి, సుందరం వీధి, కెల్లీస్ రోడ్డు, టెలిఫోన్ ఎక్సేంజ్, పాల్‌పోర్ రోడ్డు, దామోదరన్ వీధి, వెంకటపతి వీధి, ఎయిర్ ఇండియా కాలనీ, సుందర్‌లాల్ నార్త్ అవెన్యూ, ఆర్ఫ్ రోడ్డు, లూర్థన్ గార్డన్, పోలీసు క్వార్టర్స్, వాసు వీధి, రాజారత్నం వీధి, డా.మునియప్పన్ వీధి, ఈగ థియేటర్, ఎస్ఎల్ క్వార్టర్స్, ఉమ కాంప్లెక్స్ ప్రాన్సన్ గార్డన్.

పుళల్: జవహర్‌లాల్ నగర్, కామరాజ్ నగర్, ఎంఏ నగర్, ఇందిరా గాంధీ రోడ్డు, పాడియనల్లూరు, బాలగణేశన్ నగర్, కన్నప్పస్వామి నగర్, వండిమేడు, రెడ్‌హిల్స్ మార్కెట్, నారావారికుప్పం, వెజిటేరియన్ విలేజ్, శక్తివేల్ నగర్, శివరాజ్ మెయిన్ రోడ్డు, తమిళన్ నగర్

బీసెంట్ నగర్: డీఎంఎం వీధి, మహాలక్ష్మి అవెన్యూ, కామరాజర్ రోడ్డు, గంగైఅమ్మన్ ఆలయ వీధి, చెల్లపెరుమాళ్ ఆలయ వీధి, రాజు వీధి, నేతాజీ వీధి, లాల్‌బహదూర్ వీధి, ఎంజీ రోడ్డు

అంబత్తూర్: రామ్‌నగర్, లెనిన్ నగర్, వెంకటేశ్వర నగర్, ఒరగడం, సీటీహెచ్ రోడ్డు, రెడ్‌హిల్స్ రోడ్డు, పద్మావతి శ్రీనివాసన్ నగర్

ఎళిల్ నగర్: కామరాజ్ నగర్, వీజీపీ అవెన్యూ, రాయల్ అవెన్యూ, కుమరన్ కుడిల్, దేవరాజ్ అవెన్యూ, ఎళిల్ నగర్, మౌంట్ బాటన్ వీధి, పిల్లయార్ ఆలయ వీధి, ఎన్జీకే అవెన్యూ, పార్థసారధి నగర్, అన్నై పార్వతి నగర్, దేవరాజ్ నగర్, శ్రీ నగర్, మహాత్మా గాంధీ నగర్, కర్పగ వినాయకర్ నగర్, గణేశ్ నగర్, తిరువళ్లువర్ నగర్, రామలింగ నగర్, గోపినాథ్ అవెన్యూ, ఇంజంబాక్కం కస్తూరిబాయ్ నగర్.

రాష్ట్ర రైల్వే పథకాలకు తీరని అన్యాయం

● కేంద్రంపై ఎంపీ టీఆర్‌బాలు ఆగ్రహం



చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ పాలకులు రాష్ట్రంపై ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిలో ఎలాంటి మార్పు లేదని డీఎంకే కోశాధికారి, ఆ పార్టీ ఎంపీ టీఆర్ బాలు మండిపడ్డారు. ఎప్పటిలాగే బడ్జెట్‌లో రాష్ట్రానికి కొత్త పథకాలు ప్రకటించలేదని, తమిళనాడుకు మొండిచేయి చూపిందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇదివరలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తిరుక్కురళ్ సూక్తులుండేవని, అక్కడక్కడా తమిళ్, తమిళనాడు అనే మాట ఉచ్చరించటం ఆనవాయితీగా ఉండేదని, అయితే ఈ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తిరుక్కురళ్‌సూక్తులుగానీ, తమిళం, తమిళనాడు అనే పదాలు లేకుండా చాలా జాగ్రత్తపడ్డారని యెద్దేవా చేశారు. రైల్వే పథకాలకు సంబంధించి కూడా తమిళ ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని తెలిపారు.

నగరంలో వరద ముంపుపై మంత్రుల సమీక్ష

పెరంబూర్, ఆగస్టు 16: రాజధాని నగరం చెన్నైలో నైరుతి రుతుపవనాలను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలో మంత్రులు అధికారులో సమావేశం నిర్వహించారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో నగరంలో నవంబరు, డిసెంబరు నెలల్లో భారీవర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో, వరద కాలువల నిర్మాణాలు, పూడికతీత, ముందస్తు చర్యలు తదితరాలపై స్థానిక రిప్పన్ భవనంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, టీఎం అన్బరసన్, ఉదయనిధి, సుబ్రమణ్యం, ఎంపీలు, కౌన్సిలర్లు, సీఎంఆర్ఎల్, వాటర్ బోర్డు, విద్యుత్ సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మెదడు నిర్జీవమైన మహిళ అవయవదానం



సరస్వతి (ఫైల్‌ఫొటో)

వేలూరు, ఆగస్టు 16: స్థానిక సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స ఫలించక మెదడు నిర్జీవమైన మహిళ అవయవాలు దానంగా ఇచ్చారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన సరస్వతి (56) ఈ నెల 13వ తేది అర్ధరాత్రి 12.30 గంటలకు తిరువలమ్ ఈబీ రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన సరస్వతిని చికిత్స కోసం సీఎంసీ ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం రాత్రి 9.28 గంటలకు ఆమె మెదడు నిర్జీవమైందని వైద్యులు తెలిపారు. సరస్వతి కుటుంబసభ్యుల అనుమతితో వైద్యులు ప్రత్యేక చికిత్స ద్వారా తొలగించిన గుండెను చెన్నై ఎంజీఎం ఆసుపత్రికి, లంగ్స్ చెన్నై అపోలో ఆసుపత్రి, ఎడమ కిడ్నీ సీఎంసీ రాణిపేట క్యాంపస్, కుడి కిడ్నీ చెన్నైలోని కావేరి ఆసుపత్రికి తరలించి, అవసరమైన రోగులకు అమర్చారు.

సెంథిల్ బాలాజీ కేసులో సాక్షుల విచారణ ప్రారంభం

పెరంబూర్, ఆగస్టు 16: చట్టవ్యతిరేక నగదు బట్వాడా నిరోధక చట్టం కింద అరెస్టయిన మాజీ మంత్రి సెంథిల్ బాలాజి కేసులో సాక్ష్యుల విచారణను శుక్రవారం చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు ప్రారంభించింది. ఈ కేసులో ఈ నెల 8వ తేది సెంథిల్ బాలాజీకి వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఛార్జిషీటు దాఖలుచేసింది. కేసులో మొదటి సాక్షిగా కరూర్ సిటీ యూనియన్ బ్యాంక్ అప్పటి మేనేజర్ హరీష్‌కుమార్ హాజరై సాక్ష్యమిచ్చారు. బ్యాంక్ మేనేజర్‌ను సెంథిల్ బాలాజి తరపు న్యాయవాదులు ఈ నెల 22వ తేది క్రాస్ ఎగ్జామింగ్ చేయనున్నారు. కాగా, సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను 55వ సారి పొడిగిస్తూ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి అల్లి ఉత్తర్వులు జారీచేశారు.

దర్శకుడు చేరన్‌పై పోలీసులకు ఫిర్యాదు

ప్యారీస్, ఆగస్టు 16: తమిళ సినీ దర్శకుడు చేరన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కడలూరు పుదునగర్ పోలీస్‌స్టేషన్‌లో ప్రైవేటు బస్సుల యజమానుల సంఘం ఫిర్యాదు చేసింది. పుదుచ్చేరి నుంచి కడలూరుకు బయల్దేరిన ఓ ప్రైవేటు బస్సు అధిక శబ్దం కలిగిన హారన్ పదేపదే మోగిస్తుండడంతో, ఆ సమయంలో ఆ మార్గంగా కారులో వెళుతున్న చేరన్ బస్సును ఆపి డ్రైవర్‌ను హెచ్చరించినట్లు సమాచారం. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరలైన నేపథ్యంలో, ఎయిర్ హారన్ ఉపయోగించిన 20కు పైగా బస్సులపై కేసు నమోదుచేసి తలా రూ.10 వేలు చొప్పున ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. ఈ నేపథ్యంలో, ప్రైవేటు బస్సు యజమానుల సంఘం తరఫున శుక్రవారం ఉదయం చేరన్‌పై ఫిర్యాదు చేసింది. కడలూరు పుదునగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం సంఘ నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో నడుపుతున్న ప్రైవేటు బస్సుల్లో ప్రస్తుతం ఎయిర్ హారన్ లేదని, ఎలక్ట్రిక్ హారన్ మాత్రమే ఉపయోగంలో ఉందని తెలిపారు. అయితే చేరన్ నడిరోడ్డులో బస్సాపి డ్రైవర్‌తో గొడవకు దిగారని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను కోరినట్లు తెలిపారు.

బాలికకు తాళి కట్టిన యువకుడిపై పోక్సో కేసు



సామాజిక మాధ్యమాల్లో వెలువడిన దృశ్యాలు

పెరంబూర్, ఆగస్టు 16: తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి సమీపంలో బాలికకు తాళి కట్టిన యువకుడిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదుచేశారు. మేల్‌కుప్పం గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికకు ఆలయ ప్రాంగణంలో బాలాజీ (22) తాళి కడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వెలువడ్డాయి. ఈ వ్యవహారంలో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు, బాలికను రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు పరారైనా బాలాజీ కోసం గాలిస్తున్నారు.

నింగిలోకి దూసుకెళ్లిన స్పేస్ కిడ్స్ రిక్షా శాటిలైట్స్



ఆనందోత్సవాల్లో స్పేస్ కిడ్స్ రిక్షా నిర్వాహకులు

అడయార్, ఆగస్టు 16: స్పేస్ రిక్షా ప్రైవేట్ లిమిటెడ్ (స్పేస్ కిడ్జ్ ఇండియా) తయారు చేసిన ఎస్ఆర్-0 డిమో శాట్ ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్ళింది. శుక్రవారం తిరుపతి జిల్లాలోని శ్రీహరికోటలో ఉన్న షార్ సెంటర్ నుంచి ఇస్రో ఎస్ఎస్ఎల్‌వీ డి3 శాటిలైట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. సుమారు 1200 గ్రాముల బరువున్న ఎస్ఆర్-0 డీమోశాట్ ఉపగ్రహాన్ని సక్సెస్‌ఫుల్‌గా కక్ష్యలోకి ప్రవేశపెట్టడంతో ఆ సంస్థ సిబ్బంది సంబరాలు చేసుకున్నారు. ఈ శాటిలైట్... అంతరిక్ష సాంకేతికలో ఆవిష్కరణలు, విద్యపట్ల మన నిబద్ధతకు నిదర్శనమని, ఆ సంస్థ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ శ్రీమతి కేసన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

ష్రైన్ వేలాంకణి స్కూల్‌లో డైమండ్ జూబ్లీ వేడుకలు



అడయార్, ఆగస్టు 16: నగరంలోని టి.నగర్‌లో ఉన్న ప్రముఖ విద్యా సంస్థ ష్రైన్ వేలాంకణి సీనియర్ సెకండరీ పాఠశాల విద్యా రంగంలో విజయవంతంగా 60 ఏళ్ల పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన డైమండ్ జూబ్లీ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ టీకేకే పిళ్ళై మాట్లాడుతూ 1964లో స్థాపించిన ఈ పాఠశాల విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యనందిస్తూ, ప్రతి విద్యార్థి వ్యక్తిగతంగా రాణించేలా తీర్చిదిద్దుతూ మార్గదర్శకంగా నిలిచిందన్నారు. పాఠశాల కార్యదర్శి కేటీ పిళ్లై మాట్లాడుతూ, ఇది ఒక వేడుక మాత్రమే కాదని, ఒక గొప్ప మైలురాయి అని పేర్కొన్నారు.

అత్తికడవు - అవినాశి ప్రాజెక్టుపై సర్కారు ప్రకటన

● స్వాగతించిన బీజేపీ

అడయార్, ఆగస్టు 16: అత్తికడవు - అవినాశి ప్రాజెక్టును చేపట్టనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై స్వాగతించారు. ఈ విషయంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన చేపట్టాలని లేనిపక్షంలో ఈ నెల 17వ నుంచి తమ పార్టీ ఆందోళన చేపడుతుందని ప్రకటించింది. అయితే, ప్రభుత్వం ముందుకు వచ్చి అత్తికడవు - అవినాశి ప్రాజెక్టును త్వరలోనే చేపట్టనున్నట్టు ప్రకటించింది. దీంతో ఈ నెల 17వ తేదీ నుంచి చేపట్టదలచిన ఆందోళన కార్యక్రమాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు అన్నామలై విడుదలచేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.